

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళా: బలాల

సైదాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మంగళవారం ఇబన్నాత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మలక్‌పేట ఆఫీసర్స్ మెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. నిరుద్యోగ యువకులందరికి ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావని, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదా పెద్దదా అన్న అపోహ పెట్టుకోవద్దని, ఉద్యోగం చేసుకుంటూ వెళ్తే అదే ఉన్నత స్థితికి తీసుకెళ్తుందన్నారు. మేళాలో ఎంఎస్ఎంఈ, స్కిల్ డెవలప్‌మెంట్ ఎన్ఎస్‌డీఐ, ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు 50 ప్రైవేటు కంపెనీలు పాల్గొన్నాయి.



సిబ్బందికి గొడుగులు, వాటర్ బాటిల్స్ అందజేస్తున్న కమిషనర్ సరస్వతి

పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం కూడా చూసుకోవాలి

సరూర్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): నిరంతరం చెత్తా చెదారం మధ్య విధులు నిర్వర్తించే పారిశుధ్య సిబ్బంది తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉన్నదని బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి అన్నారు. మునిసిపల్ పారిశుధ్య సిబ్బందికి ప్రభుత్వం సరఫరా చేసిన గొడుగులు, వాటర్ బాటిళ్లు, టోపీలు తదితర వస్తువులను మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ, పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. సిబ్బందికి ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యాంసుందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన అధికారిని అభినందిస్తున్న నర్సింహారెడ్డి

రైతు సమస్యల పరిష్కారంలో ముందుండాలి

ఓల్డ్‌మలక్‌పేట మే13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతులకు మద్దతు ధర విషయంలో గాని వసతుల కల్పన విషయంలో గాని మార్కెట్ ఉద్యోగులు ముందుండి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముఖరం సూచించారు. మగళవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గ్రేడ్ టు నుంచి గ్రేడ్ వన్‌గా పదోన్నతి పొందిన అధికారి అశోక్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జిఎస్ దామోదర్ ఉద్యోగులు పవన్, శ్రీనివాస్ తదితరులున్నారు.



డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవికి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేస్తున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్

ఆర్టీసీ హయత్‌నగర్ ఎంప్లాయిస్ కార్యవర్గం

చాదర్‌ఘాట్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హయత్‌నగర్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా హయత్‌నగర్ డిపో-1 డ్రైవర్ సోమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని మంగళవారం ప్రకటించారు. డివిజన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్వరం డిపో కండక్టర్ జి.నరసింహ, కార్యదర్శిగా మిధాని డిపో కండక్టర్ కత్తి రాములును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవికి పరిచయం చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఆనందం, సెక్రెటరీ కె.నిరంజన్, హైదరాబాద్ రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధాకర్‌రావు, ఎం.శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుక్రు నాయక్ పాల్గొన్నారు.



హయత్‌నగర్ పాఠశాలలో 1986-1987 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమేళనం

హయత్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): 1986-1987 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. వీరంతా సరిగ్గా 39 సంవత్సరాల క్రితం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్నారు. మంగళవారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించుకుని చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారంతా మళ్లీ ఒకే వేదికపైకి వచ్చి చిన్న పిల్లలుగా మారి ఆటలాడుకుంటూ, పాటలు పాడుకున్నారు. కలిసి భోజనం చేశారు. తంబోలా ఆటలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

భూగర్భ డ్రైనేజీ పనుల పర్యవేక్షణ

మన్సూరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ క్రాంతి యువజన సంఘం వద్ద రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనే జీ పనులను జలమండలి మేనేజర్ సిరివెన్నెలతో కలిసి పర్యవేక్షించారు. అదేవిధంగా పద్మావతీకాలనీలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి పర్యటించిన ఆయన కాలనీలో వీధి దీపాలు, త్రీఫేజ్ విద్యుత్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సానుకూలంగా స్పందించారు. ఆయా కార్యక్రమాల్లో పద్మావతీకాలనీ అధ్యక్షుడు రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

డిప్యుటేషన్ అధికారే దిక్కు..!

- నారాయణపేట్ టీపీవోకు బడంగ్‌పేట్ అదనపు బాధ్యతలు
- మారని డీటీసీపీ అధికారుల తీరు
- వారంలో నాలుగు రోజులే ఇక్కడ
- మద్దూర్ మునిసిపాలిటీకి సైతం ఆయనే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బడంగ్‌పేట్ ప్రజలు



బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం

సరూర్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు.. ఇద్దరు టీపీవోలు ఉండాల్సిన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు మరోసారి ఓ డిప్యుటేషన్ అధికారిని నియమించి చేతులు దులుపుకున్నారు. దాంతో కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విస్తీర్ణంపరంగా ఎంతో పెద్దదైన బడంగ్‌పేట్‌కు కచ్చితంగా ఇద్దరు టీపీవోలు అవసరమని మునిసిపల్ అధికారులు సైతం పేర్కొంటున్నారు. 2013లో ఏడు గ్రామాలతో ఏర్పాటైన బడంగ్‌పేట్ నగర పంచాయతీకి అప్పట్లో కూడా ఒక డిప్యుటేషన్ అధికారే ఉన్నారు. నగర పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా, అనంతరం కార్పొరేషన్‌గా స్థాయి పెరిగినా టౌన్ ప్లానింగ్ పరిస్థితి మాత్రం మారడం లేదు. నాటి నుంచి నేటి వరకు (2013-2025) పన్నెండేళ్లుగా ఇక్కడి టౌన్ ప్లానింగ్‌కు డిప్యుటేషన్ అధికారులే దిక్కుగా మారారు. దాంతో సదరు అధికారి వారంలో మూడు, నాలుగు రోజులు మాత్రమే వచ్చి పోవడమే ఇక్కడ ఆనవాయితీగా మారిందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

నాలుగు రోజులు ఇక్కడ.. రెండు రోజులు అక్కడ

ప్రస్తుత టీపీవో కిరణ్‌కుమార్ బడంగ్‌పేట్‌లో నాలుగు రోజులు (సోమ, మంగళ, బుధ, గురు) విధులు నిర్వహించాల్సి ఉంటుందంటూ డీటీసీపీ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. మిగతా రెండు రోజులు నారాయణపేట్, మద్దూర్ మునిసిపాలిటీల బాధ్యతలు నిర్వర్తించాలి. ఇప్పటిదాకా వారం మొత్తం ఆయా మునిసిపాలిటీల్లో పని చేయడానికే సమయం సరిపోని టీపీవోకు.. ఇప్పుడు బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాధ్యతలు సైతం అప్పగించి వారంలో నాలుగు రోజులు ఇక్కడే ఉండాలని ఆదేశించడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కబ్జాలపై ఫిర్యాదులు

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలు, పార్కుల కబ్జా కథలు లెక్కకు మిక్కిలి ఉన్నట్టు స్థానికులు తరచుగా ప్రజావాణిలో, హైడ్రా, రెవెన్యూ, మునిసిపల్ కార్యాలయాల్లో అందజేస్తున్న ఫిర్యాదులను బట్టి తెలుస్తోంది. బిల్డర్లు, రియల్ వ్యాపారులు, రాజకీయ నాయకులు అక్రమ కట్టడాలను కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్పొరేషన్, రెండు మునిసిపాలిటీలకు ఒకే అధికారి

బడంగ్‌పేట్ టీపీఎస్‌గా రెండేళ్ల పాటు పనిచేసిన లాలప్ప గత నెల 30న బదిలీ అయిన సంగతి తెల్సిందే. వారం దాటినా కొత్త అధికారిని నియమించక పోవడంతో ఈనెల 7వ తేదీన 'టీపీవో కుర్చీ ఖాళీ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు కొత్త టీపీవోను నియమించగా.. ఆయన ఈ నెల 10న బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నారాయణపేట్ మునిసిపాలిటీలో రెగ్యులర్ టీపీవోగా విధులు నిర్వహిస్తున్న పి.కిరణ్‌కుమార్‌ను బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు డిప్యు టేషన్‌పై పంపి అదనపు బాధ్యతలు అప్పగించారు. అప్పటికే ఆయనకు నారాయణపేట్‌తో పాటు మద్దూర్ మునిసిపాలిటీ బాధ్యతలు సైతం ఉండ డం గమనార్హం. తాజాగా బడంగ్‌పేట్ బాధ్యతలు కూడా అప్పగించడంతో ఆయన పరిస్థితి 'మూడిళ్ల పూజారి'లా మారిందనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఒకే అధికారి నారాయణపేట్, మద్దూర్ మునిసిపాలిటీల్లో విధులు నిర్వహించడమే కష్టసాధ్యం కాగా.. విశాలమైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాధ్యతలు సైతం ఆయనకు అప్పగించడం ఉన్నతాధికారుల అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.

పూర్తిస్థాయి టీపీవోను నియమించాల్సిందే

ప్రభుత్వ ఉన్నతాధికారులు బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిని, అక్కడి అక్రమ నిర్మాణాలు, పార్కుల కబ్జా వ్యవహారాలను పరిగణనలోకి తీసుకుని డిప్యుటేషన్ టీపీవో స్థానంలో పూర్తిస్థాయి టీపీవోను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించాలి

సరూర్‌నగర్, మే13 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకూ వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతున్న నేపథ్యంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. 'రైతుల వద్దకు శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంఘం కార్యాలయానికి వ్యవసా య శాస్త్రవేత్తలు, అధికారులు విచ్చేసి ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

అబ్దుల్లాపూర్‌మెట్, మే13 (ఆంధ్రజ్యోతి): ఇండ్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వ భూమిలో 100 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించాలని బాటసింగారం గ్రామ మాజీ సర్పంచ్ లతాశ్రీగౌరిశంకర్‌చారి కోరారు. మంగళవారం ఆమె స్థానికులతో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

ఖాళీ స్థలంలో కాలనీ సంక్షేమ సంఘ భవనం నిర్మించండి

కార్పొరేటర్ కొప్పులకు సభ్యుల వినతి

మన్సూరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు కేటాయించిన ఖాళీ స్థలంలో ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని నిర్మించేందుకు సహకరించాలని మన్సూరాబాద్ డివిజన్ హిమపురికాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రోడ్ నం.1 నుంచి 7వరకు పర్యటించిన స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హిమపురికాలనీ రోడ్ నం.3లో గల 400 గజాల ఖాళీ స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా కాలనీ సంక్షేమ భవనం నిర్మాణానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారన్నారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు ప్రజావసరాలకు ఉపయోగపడేలా కృషి చేస్తానని కార్పొరేటర్ నర్సింహారెడ్డి వారికి హామీ ఇచ్చారు.

బీజేపీది కార్మిక వ్యతిరేక పాలన : చంద్రమోహన్

దిల్‌సుఖ్‌నగర్, మే13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదకొండేళ్లుగా కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆరోపించారు. సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ వీరయ్య అధ్యక్షతన మంగళవారం చైతన్యపురి మున్సిపల్ కాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు విక్రయిస్తుందని ధ్వజమెత్తారు. జీహెచ్ఎంసి కార్మికులందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రెస్‌కాలనీలో నల్లాలకు అమర్చిన మోటార్ల తొలగింపు

మన్సూరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నల్లాలకు మోటార్లు బిగించుకున్న వాటిని తొలగించడంతో పాటు తగిన చర్యలు తీసుకుంటామని వాటర్ వర్క్ అధికారులు హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ ప్రెస్ కాలనీలోని మూడు ఇళ్లల్లో నల్లాలకు మోటార్‌ను బిగించిన విషయాన్ని తెలుసుకున్న అధికారులు మంగళవారం ఆయా ఇళ్లల్లో మోటార్లను తొలగించి వారిపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ కార్యాలయం ఎదుట , ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఓల్డ్‌మలక్‌పేట మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ మంగళవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో మలకపేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట వివిధ జిల్లాలనుంచి వచ్చిన దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో దివ్యాంగులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని వారి ఆస్తులను ఆక్రమించుకుంటున్న వారిపై పోలీసులుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. మహిళా దివ్యాంగులు అత్యాచారాలు, లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి ఉపాధి అవకాశాలు లేక బిక్షాటన చేస్తూ కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 49 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీఎం ప్రభంజన్‌రావుకు సమర్పించి అనంతరం ధర్నా విరమించారు. ధర్నా కార్యక్రమంలో ఆర్.వెంకట్, సాయమ్మ, రాణి, చందు, తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

మీర్‌పేట్ పోలీసులకు బీజేపీ ఫిర్యాదు



మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు రామకృష్ణారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మే 13(ఆంధ్రజ్యోతి): 'పబ్లిక్ అసెంబ్లీ' అనే వాట్సాప్ గ్రూప్‌లో శ్రీనివాస్ అనే వ్యక్తి ఆపరేషన్ సిందూర్‌ను విమర్శిస్తూ పోస్టులు పెట్టాడని, వెంటనే అతడిని అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు పోలీసులను కోరారు. ఈ మేరకు బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, భిక్షపతిచారి, ముఖేశ్‌కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ రక్షణ కోసం క్షణం తీరిక లేకుండా పనిచేస్తుండగా, కొందరు దేశ ద్రోహులు భారత్ ప్రతిష్ఠ దిగజార్చేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ అవమానిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు సదరు వ్యక్తిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, కీసరి గోవర్ధన్‌రెడ్డి, భీమ్‌రాజ్, హైందవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి : కార్పొరేటర్ కళ్లెం



ఆర్‌టీసీ మజ్దూర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మునగనూరు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను, గాయత్రినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టీసీ మజ్దూర్ యూనియన్ కాలనీలో మరిన్ని సీసీ రోడ్లను నిర్మించడం జరుగుతుందన్నారు. కాలనీని అభివృద్ధి చేయడం తన కర్తవ్యం అన్నారు. హిందు శ్మశాన వాటికలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. శ్మశాన వాటికలో పచ్చదనాన్ని పెంచాలని కోరారు. డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ కాలనీ అధ్యక్షుడు సూర్య, డీఈఈ దామోదర్, ఏఈ హేమా నాయక్, ఇన్‌స్పెక్టర్ సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించండి

సరూర్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శ్మశానవాటికల్లో సరైన సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వసతులు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్-12 బీజేపీ అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్‌ముదిరాజ్ మునిసిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ పెద్దచెరువుకు తూర్పు వైపు ఉన్న శ్మశానవాటిక, పడమర వైపు లెనిన్‌నగర్ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న శ్మశానవాటికతో పాటు జిల్లెలగూడలోని శ్మశానవాటికలోనూ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా శ్మశానవాటికల్లో స్నానాల గదులు, విద్యుత్ దీపాలు, నీటి వసతి కల్పించి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ భీమ్‌రాజ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సోమేశ్వర్, ప్రధాన కార్యదర్శి గాజుల మధు, సూల ప్రభాకర్, వి.గోపీనాథ్, తుమ్మల రమేశ్, సిద్దాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రూ.13 లక్షలతో సీసీ రోడ్డు పనులు : కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి



ప్రశాంత్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చాదర్‌ఘాట్, మే 13(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతన సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ప్రారంభించారు. ఇందుకు గాను రూ.13లక్షలను వెచ్చిస్తున్నట్లు ఆమె వివరించారు. డివిజన్‌లోని గడ్డిఅన్నారం బస్తీ, ఫ్రెండ్స్ కాలనీలోని మోక్షిత టిఫిన్స్ లేన్‌లో, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్డు, ముసారాంబాగ్ బస్తీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, వాటిని కూడా సీసీ రోడ్లుగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు తయారు చేయించినట్లు కార్పొరేటర్ వివరించారు.

రూ.90వేలతో శ్మశానవాటికలో వీధి దీపాల ఏర్పాటు

ముసారాంబాగ్‌లోని హిందూ శ్మశానవాటికలో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. శ్మశానవాటికలో వీధి దీపాల ఏర్పాటుకు 15 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించినట్లు ఆమె వివరించారు. వీటి ఏర్పాటుకు రూ.90వేల వరకు వ్యయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్ట్రీట్ లైట్స్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, లైన్‌మెన్ సురేష్, బస్తీవాసులు బల్వంత్, జగన్, నరసింహ, శంకర్, మల్లేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో సత్తా చాటారు



సామిలీ



సహస్రా



అభినవ్

చంపాపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిదానీ టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి (ఏఐఎస్ఎస్ఈ) పరీక్షా ఫలితాలలో సత్తాచాటారు. పాఠశాలలోని 179మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 179మంది విద్యార్థు లు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన సామిలీ మన్నా 98.6 శాతం, శ్రీ సహస్రా బొప్పన 98.4 శాతం, వెంకట అభినవ్ క్రిష్ణా 98 శా తం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వీఎస్ ప్రశాంత్ తెలిపారు.



పూజల్లో కార్పొరేటర్ పవన్‌కుమార్, సామరంగారెడ్డి

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

కొత్తపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట వినాయకనగర్ కాలనీలో గల శ్రీ బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ ఆలయ 15వ వార్షికోత్సవ ప్రత్యేక పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో కార్పొరేటర్లు పవన్ కుమార్, నర్సింహగుప్త, రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామరంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్‌గౌడ్, ఆలయ ఛైర్మన్ కట్ట వెంకటేశంస్వామి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి :మద్దిలేటి

ఎల్‌బీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): మే 20న దేశవ్యాప్తంగా జరుప తలపెట్టిన కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేద్దామని ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఎల్‌బీనగర్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ, వందల సంవత్సరాల కార్మిక పోరాటాల ఫలితంగా ఏర్పాటు చేసిన 44 చట్టాలలో 29 చట్టాలను కేంద్రం రద్దు చేసి కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో దాదాపు 47 కోట్ల మంది నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను హరించే నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు పర్మినెంట్ అయ్యే వరకు కనీస వేతం రూ. 26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.